# ఉరి

***'ఆనందవాణి' - వారపత్రిక - 17-12-1950 సంచిక***

నాకు మీరు ఉరిశిక్షవేశారు. నన్ను చెప్పుకునేది చెప్పుకోమన్నారు. శిక్ష వేయక ముందు చెప్పుకోమంటే అర్థం ఉండేది. ఇప్పుడు చెప్పుకొన్నా ఒకటే, చెప్పుకొనకపోయినా ఒకటే. కాని మీరిప్పుడు చెప్పుకోమనటంలో ఒక విశేషం ఉంది. ఎట్లాగూ చస్తున్నాడుకదా, చచ్చింతర్వాత మాట్లాడేదిలేదు పెట్టేదిలేదు, ఆ మాట్లాడేది కాస్తా యిప్పుడే మాట్లాడమని. మనుష్యుడై జన్మ యెత్తిన తర్వాత మాట్లాడటంలో కొంత లౌకికమైన సంతోషం ఉంటుంది. అది మాయాపి హితులైన మానవులకు సహజలక్షణం. మీకు నా శరీరంమీద ప్రేమలేదు. నా ఆత్మమీద ప్రేమ. నా ఆత్మ మీ ఆత్మలు అందరివి ఒకటేగనుక, అయినా కాకపోయినా మీరనుకొంటున్నారు గనుక యిది ఒక మామూలు.

ఇప్పుడు నేను మాట్లాడకపోతే నష్టంలేదు. మాట్లాడితే వచ్చే లాభంలేదు. కాని నేను మాట్లాడితే లాభం ఉంటుందని కొందరనుకొంటారు. వాళ్ళ ఉద్దేశంలో మాట్లాడవలసిందే. ఏమైనాసరే మాట్లాడవలసిందే. బ్రతికియున్నంత వరకు ప్రయత్నం చేయవలసిందే. బ్రతికిఉన్నంత మందీ ప్రయత్నం చేయవలసిందే. వాళ్ళు మీ కన్న మాయాపిహితులు.

నేను మనిషిని చంపానని మీరు నాకు ఉరిశిక్ష వేశారు. ఆ చంపానన్నది నాకు తెలియదు. మీకూ తెలియదు. చంపానని సాక్ష్యం యిచ్చినవాళ్ళకీ తెలియదు. నాకు తల్లీ పెళ్ళాం బిడ్డలు ఉన్నారు. వాళ్ళను పోషించలేక నేను చాలా బాధపడ్డా. వాళ్ళకు తిండిలేదు. నాకూ తిండిలేదు. మీ దయవల్లరెండు నెలలనుండి ఖైదులో కూర్చొని అన్నంమాత్రం తిన్నాను. ఈ రెండు నెలలు వాళ్ళేమైనారో నాకు తెలియదు. ఈ పాటికి వాళ్ళూ చచ్చేఉంటారు. వాళ్ళకన్న నేనే అదృష్టవంతుణ్ణి. వాళ్ళు చావకముందు మాడిమాడి చచ్చిఉంటారు. నేను చచ్చేముందు ఏదో యింత అన్నం తినే చస్తున్నా.

నేను ఉద్యోగం చేయలేదు. కూలీనాలీ కుదుర లేదు. మోసం చేయలేను. ఎక్కడో నాల్గురాళ్ళు సంపాదిస్తే దాంతో బియ్యం కొనుక్కుందామంటే బియ్యం దొరకలేదు. అదివరకు నాల్గురోజులు ఇంటిల్లిపాతికా పస్తున్నాం. నేను, నా భార్య ఎల్లాగో అల్లాగా తమాయించుకొన్నాం. పిల్లలు బక్క నరాలై కూర్చున్నచోటునుంచి లేవలేక యేడ్చేశక్తి గూడా లేక బ్రతికిఉన్న శవాలల్లే పడి ఉంటే చూడటం యెలాగా?

బియ్యం అమ్మే దుకాణం పెద్దపులల్లే ఇరవై గజాలతోక పెంచుకొని - ఆ తోకచివ్వర నేను. నాలుగురోజులు ఈ తోకచివరితనం పొందలేక పొందలేక విసిగి చివరికి యింటికివచ్చాను. ఒక ముసలిది నామీద దయపుట్టి తనకువచ్చిన బియ్యంలో సగం నాకు రెట్టింపు ధరకు అమ్మింది. ఆ బియ్యం తీసికొనివచ్చి వండి పిల్లలకు పెడ్దామంటే అవి గొడ్లు తినాలిగాని మనుష్యులు తినరు. నాలుగుపోట్లు వేసి చెరిగితేనేగాని వండటానికి పనికిరావు. దంచాలి అంటే నాలుగురోజులు తిండిలేని మా యింటిదానికి ఓపికలేదు, నాకూ లేదు. అయినా పిల్లల స్థితి చూడలేక మా యింటిది ఆ బియ్యం చిరిగిన చీరకొంగున కట్టుకొని పది కొంపలు తిరిగింది. ఒకళ్ళు విసిరికొట్టారు, మరి ఒకళ్ళు - వాళ్ళయింట్లో నోమట - అట్లకోసం పిండి దంచుకొంటున్నారు. అన్ని యిళ్ళు ఇట్లాగే అయినవి. చివరకా బియ్యామే ప్రొయ్యిరాళ్ళమీద పెట్టింది మా యింటిది. ప్రొయ్యిక్రింద మంటలేదు. ఒకాయన దొడ్డిచుట్టూ కంచె వేశాడు. ఆ కంచె గాడిదలూ, కుక్కలూ, పందులూ విరగతొక్కినవి. కంచెపుల్లలు ఇటు అటూ పడి ఉన్నవి. అవి యెవరికీ పనికిరావు. అవి నేను ఏరితెస్తూంటే ఆ ఒకాయన "ఎవడి అమ్మామొగుడి సొమ్మను కొన్నావు" అనివచ్చి నన్ను కట్టతో విరగగొట్టాడు.

ఇంటికివచ్చాను. ఇల్లంటే నవ్వు వస్తోంది. ఎవళ్ళదో పడిపోయిన గోడ ఉంటే - ఆ స్థలంలో యెవళ్ళూ కాపరానికిలేరు - ఆ గోడక్రింద ఉంటున్నాం. అదే యిల్లు, పైన పుల్లాపుడకాపెట్టి తలలు మాత్రం దానిక్రింద పెట్టి నిద్రపోయేటట్లుగా మా యింటిది ఆధారంచేసింది. నేను వెళ్ళేటప్పటికి ఆ ఆధారంతీసి దానితో మంటవేస్తోంది. ఈ ఆధారం ఎక్కువా? పిల్లల కడుపుమంట ఎక్కువా?

మరునాడు మా పిల్లలస్థితిచూడగా కడుపులో నొప్పితో మెలితిరిగిపోయినారు. నాలుగు వాము పరకలు తెద్దామంటే చేతిలో ఉన్న నాలుగణాలు నిన్నటిముసలమ్మే కాజేసింది. మళ్ళీ తర్వాత నాలుగురోజులవరకు బియ్యం లేవు. పిల్లల కడుపునొప్పులూ తగ్గలేదు. మా యింటిది లేవనే లేకపోయింది. నే నట్టాగే తిరుగుతున్నాను.

ఆ రోజున మధ్యాహ్నం జనం గుంపులుగా వెళ్ళుతున్నారు. నేను వాళ్ళెక్కడికి వెళుతున్నారని అడిగాను. అందరికీ బియ్యం ఇస్తారట అని చెప్పారు. నేను వాళ్ళవెంట వెళ్ళాను. వాళ్లు వందా రెండువందలమంది ఉన్నారు. జనం ఒకచోటికి వెళ్ళారు. జనం కేకలూ బొబ్బలూ నానా హంగామాగా ఉంది. ఒక యింటిదగ్గర ఆగారు. ముందర యేమిజరుగుతోందీ నాకు తెలియదు. నేను వెనక ఉన్నాను. బియ్యంకోసం త్రొక్కిళ్ళాడుతున్నా రనుకొన్నాను. చుట్టుప్రక్కల యిళ్ళవాళ్ళందరూ కొందరు తలుపులు వేసికొన్న వాళ్ళూ కొందరు తొంగిచూచేవాళ్ళూగా కన్పించారు.

కొంతసేపటికి రక్షకభటులు వచ్చారు. నేననుకొన్నాగదా "అమ్మయ్యా! వీళ్ళువచ్చారు గదా! అందరికీ సరిగ్గా పంచిపెట్టిస్తారు" అని. క్రమక్రమంగా నాకుతెలిసింది. ఈ గుంపుకీ ఆ రక్షకభటులికీ దెబ్బలాట జరుగుతోందని.

ఇంతలో రక్షకభటులు తుపాకులు కాల్చారు. ఈ గుంపులోంచి రక్షకభటులమీద రాళ్ళు విసరు తున్నారు.

వ్యవహారం యెప్పుడైతే ముదిరిందో నా కెందుకురాబాబూ ఇది పోదామనుకొన్నాను. కాని పోవటమెట్లా? అదివరకు నెల్లాళ్ళమట్టి తిండే లేదు. వారానికొకసారి యేదో తినీతిననట్టు తిన్నా నావంట్లో ఓపికలేదు. మనిషిని మరీ అర్భనా కారిని కాదుగనుక మనుష్యాకృతిలో లోపంలేదు.

రక్షకభటులలో కొందరికి దెబ్బలు తగిలినవి. ఒకడికి రాయి నెమరకణతను తగిలిచచ్చాడు. ఆ రాయి ఆ చుట్టుప్రక్కలవాడెవడు విసిరాడో నాకు తెలియదు.

సైగా చంపడంలో యిన్ని భేదాలేమిటి? రాయితగిలితే చచ్చి, తుపాకిగుండు తగిలితే బ్రతుకుతాడా? తుపాకిగుండు తగిలిచస్తే శిక్ష లేదూ! రాయితగిలి చస్తే శిక్షా?

ఆ కళ్ళులేని దేవుడు - ఆ రాయి నేనే విసిరానన్నాడు. రాయి విసరటం మాటా అట్లా ఉంచండి. నేను చేయి యెత్తగలిగితే చాలు! ఆ స్థితిలో ఉన్నాను. రక్షకభటులు తరిమారు. అందరూ పారిపోతున్నారు. నేనూ పారిపోతున్నాను. పరిగెత్తేందుకు నాకుఓపికయేదీ? వెనకనుంచి నా నెత్తిమీద పెద్దదెబ్బపడ్డట్టుగా మాత్రమే నాకు తెలుసు.

ఒకరాత్రివేళ నాకు మెలకువ వచ్చింది. గాఢాంధకారంలో కూర్చొనిఉన్నా. మరునాటి ప్రొద్దుటికి తెలిసింది నాకు అది ఖైదని.

ఒకటిరెండు పూటలైన తర్వాత నా కన్నం పెట్టారు. అన్నంచూస్తే నా ప్రాణాలు లేచి వచ్చినవి. వెంటనే పిల్లలు జ్ఞాపకం వచ్చారు. వాళ్ళకుపెడదామని అన్నం అట్టే పెట్టాను. మరునాటికి తెలిసింది. యింక వాళ్ళు నా దగ్గరకు రారని.

వాళ్ళేమైనారో?! ఏమైనారో యెవడికి కావాలి?

పూటపూటా అన్నంతినటం నాకూ అలవాటైంది.

నాపని రాజభోగంగా ఉంది. రెండుపూటలా తిండి. ఎక్కడికైనా తీసికొనివెళ్ళితే మోటారు కారులో తీసికొని వెళ్ళారు. పెద్దకోర్టులో కూడా నా కోసం ఒక ప్రత్యేక స్థానం. చివరిరోజుల్లో నాకు దశయెత్తుకొంది. ఆ పాడుదేవుడు ఈ మాత్రంగా ఆ వెనుక కూడా సాగిస్తే యెంతబాగుండేది?

ఇంతకన్న యేమిచెప్పను? నాకు ఇంత ఉపకారం చేసిన మీరు వెయ్యేళ్ళు బ్రతకండి.

బ్రతుకంతా తిండిలేక చచ్చిన నాకు రెండునెలలు సుఖంగా తిండిపెట్టారు. మీ కడుపులు చల్లగా ఉండాలి.

కాని నా యింటిదీ, పిల్లలూ ఏమైనారో తెలియ లేదు. నాకు ఒక్కటే చింతగా ఉంది. నా పిల్లలు కొంచెం పెద్దవాళ్ళు అయితే - ఎల్లాగో అల్లాగా పెద్దవాళ్ళు అయితే - చివరి రోజుల్లో వాళ్ళకు గూడా నాకుపట్టిన యోగం పడుతుందా అని.

అదంతా మీదయ. వాళ్ళని వెదికించి యీ ఉపకారం చేయిస్తే మీ కడుపున పుట్తాను.